ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు, 2024

5

శ్రీకాకుళం



నేడు, రేపు ఎస్‌టి కమిషన్ సభ్యుని పర్యటన



ప్రజాశక్తి - టెక్కలి

ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. 27న జలుమూరు మండలం మాకివలసలో పర్యటించి గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు. అదే రోజు హిరమండలం మండలంలోని అంతకాపల్లి, పునుపేట, సవితిసీది గ్రామాల్లో పర్యటిస్తారు. 28వ తేదీన ఆముదాలవలస మండలం అల్లిపిల్లిగూడ, పాతపట్నం మండలం నల్లబొంతు గ్రామంలో పర్యటిస్తారని తెలిపారు.

పాడి రైతులకు పరిహారం ఏదీ?



మృతి చెందిన పశుకళేబరం వద్ద విలపిస్తున్న పాడిరైతు (ఫైల్)

- మూడేళ్లు గడిచినా రైతులకు అందని బీమా డబ్బులు
- జిల్లాలో రూ.12.50 కోట్ల మేర బకాయిలు
- సాంకేతిక ఇబ్బందులే కారణమని చెప్తున్న అధికారులు
- ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్న పెంపకందారులు

మృత్యువాత పడిన పశువులకు చెల్లించే పరిహారం అందకపోవడంతో మూడేళ్లుగా పాడి రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్థకశాఖ అధికారుల చుట్టూ పాడి రైతులు తిరుగుతున్నారు. గత ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమాకు మొదటి సంవత్సరం సొమ్ములు చెల్లించినా ఆ తర్వాత నుంచి ఆపేసింది. ఆర్‌బిఐలో సాంకేతిక సమస్యలతో డబ్బులు నిలిచిపోయాయంటూ చెప్తూ వచ్చింది. వైసిపి అధికారంలో ఉన్నన్నాళ్లు ఈ సమస్యకు పరిష్కారం చూపించలేకపోయింది. దీంతో టిడిపి కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. పరిహారం చెల్లింపులకు ఉన్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కారానికి చొరవ చూపాలని పశుపెంపకందారులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వైఎస్సార్ పశు బీమా పథకం అమలుకు ముందు వైఎస్సార్ పశునష్ట పరిహారం పేరుతో 2019 నుంచి అమలు చేసింది. నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మృత్యువాత పడిన పశువులకు ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే పరిహారం కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. తొలుత కొంతమందికి డబ్బులు చెల్లించినా మిగిలిన వారికి రెండేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. జిల్లాలో 4,458 పశువులకు పరిహారం సొమ్ము చెల్లించాల్సి ఉంది. 2021 జూన్ నుంచి పరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. తాము బిల్లులు పంపినా రిజర్వు బ్యాంకు కొర్రీలతో క్లియరెన్స్ కావడం లేదని అధికారులు చెప్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో రెండున్నరేళ్లుగా రైతులు పరిహారానికి నోచుకోవడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్ధకశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు.

రూ.12.50 కోట్ల మేర బకాయిలు

పాడి రైతులు పశువుల బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించనవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో ఏ రైతూ సొంతంగా బీమా చేయించుకోలేదు. 2020 నుంచి ఈ పథకం ద్వారా ఎవరికీ లబ్ధి చేకూరడం లేదు. పశువుల బీమా ఉంటే మేలుజాతి పశువు మృతి చెందితే రూ.30 వేలు, సాధారణ రకమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. పశువు మృతి చెందిన 24 గంటల్లో రైతు పశువైద్యాధికారికి సమాచారం ఇస్తే, 48 గంటల్లో పోస్టుమార్టం పూర్తి చేసి ఆపై సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసేవారు. పశుసంవర్ధకశాఖ డీడీ, ఎడి, ఇద్దరు పశువైద్యుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసేవారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత ఆమోదం తెలిపేవారు. పశువులకు సంబంధించి రూ. 12.50 కోట్లు బకాయిలు ఉన్నాయి.

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

క్లయిమ్‌లను పరిష్కరించాలని పశు పెంపకందారులు, రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రైలు, రోడ్డు ఇతర ప్రమాదాలు, ఇతర వ్యాధుల బారిన పడి వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు. కనీసం ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చినా కొంతమేర ఉపయోగపడేవని రైతులు వాపోతున్నారు. మండలాల్లోని వెటర్నరీ ఆస్పత్రులు, పశుసంవర్ధకశాఖ కార్యాలయం చుట్టూ క్లయిమ్‌దారులు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

- పైడిభీమవరంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజిన్ ఏర్పాటు చేయాలి
- సిఐటియు డిమాండ్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు సంభవించి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలోని అరబిందో పరిశ్రమలో గతంలో సంభవించిన ప్రమాదాల్లో ఎనిమిది మంది, ఎపిటోరియా పరిశ్రమలో విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందారని గుర్తుచేశారు. సరాకా పరిశ్రమలో ఒకరు, శ్రేయస్‌లో ఇద్దరు, రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఒకరు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని తెలిపారు. గతంలో నాగార్జున అగ్రికమ్ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో విశాఖపట్నం నుంచి హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజిన్ తెప్పించి మంటలు అదుపు చేయాల్సి వచ్చిందన్నారు. చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలను ఆ సమయంలో ఖాళీ చేయించారని గుర్తుచేశారు. జిల్లాలో భారీ, మధ్య తరహా కెమికల్ పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే స్థానికంగా ఉన్న ఫైర్ ఇంజిన్లతో అదుపు చేయడం సాధ్యం కాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించినా నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు భద్రతా చర్యలంటూ హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమాన్యాల ఇష్టారాజ్యంగా కంపెనీలు నడుపుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తున్నాయన్నారు. యాజమాన్యాలు కార్మికుల భద్రతను విస్మరిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ వేయాలని, అందులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మూడు నెలలకోసారి పరిశ్రమలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మికశాఖ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలకోసారి ఫార్మా ఇతర పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులందరికీ అవసరమైన భద్రతా పరికరాలు యాజమాన్యాలు అందజేసే విధంగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కీమ్‌వర్కర్లు, విఒఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు.

పైడిభీమవరంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీని 24 గంటలు నడపాలని, పూర్తిస్థాయిలో వైద్యులు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం, ఎచ్చెర్లలో మూసివేసిన డిస్పెన్సరీలను, పలాస, టెక్కలిలో ఎత్తివేసిన పానెల్ క్లినిక్‌లను వెంటనే తెరిపించాలన్నారు. జిల్లాలోని గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. శ్యామ్‌పిస్టన్స్, యునైటెడ్ బ్రేవరీస్ కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చి వేతన ఒప్పందాలు చేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ భీకర దాడులు, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా సెప్టెంబరు ఒకటో తేదీన శ్రీకాకుళం నిర్వహించే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మిక, ప్రజాసంఘాలతో శ్రీకాకుళంలో సెప్టెంబరు పదో తేదీన నిర్వహించే ఆందోళనలో అన్ని సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, జిల్లా కార్యదర్శులు అల్లు మహాలక్ష్మి, ఎన్.వి రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, బి.ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌ను అంగీకరించేది లేదు

ప్రజాశక్తి- నరసన్నపేట

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)ను అంగీకరించేది లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారెంటీ చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందని తెలిపారు. సర్వీసులో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం కుటుంబ పెన్షన్ ఇస్తామని వెల్లడించిందని పేర్కొన్నారు. చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం, పైగా ఐచ్ఛికం అని ప్రస్తావించడంలోనే అసలు మోసం ఉందని తెలిపారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే దీనికి పరిష్కారమని సూచించారు. పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పారదర్శకంగా బదిలీలు

- ఎవరూ దళారులను ఆశ్రయించొద్దు
- త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, కోటబొమ్మాళి

ప్రభుత్వ ఉద్యోగులకు చేపడుతున్న సాధారణ బదిలీలను జిల్లాలో పారదర్శకంగా చేపడతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి, కోటబొమ్మాళిలో అన్న క్యాంటీన్లను సోమవారం మంత్రి ప్రారంభించి స్వయంగా వడ్డించారు. అనంతరం టెక్కలిలో మూడు కొత్త ఆర్‌టిసి బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. అర్హత, నిబంధనల ప్రకారం అందరికీ బదిలీల్లో న్యాయం చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రూ.13 లక్షల కోట్లు అప్పులు చేసిందని, ప్రస్తుతం ఆదాయం కనిపించే పరిస్థితి లేదన్నారు. అయినా ఇచ్చిన మాట తప్పకుండా హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచామని, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశామన్నారు. టెక్కలి నియోజకవర్గంలో ఒక పూట ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి, మరో పూట క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించేందుకు నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రతి వీధి తిరుగుతూ సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం

తెలుగుదేశం ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కర్నాటక, తెలంగాణలో అమలవుతున్న విధానాన్ని ఇప్పటికే అధ్యయనం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనూ త్వరలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలకు రూ.ఐదుకే కడుపు నిండా భోజనం పెట్టే సంకల్పంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, రూ.ఐదుకే నాణ్యమైన భోజనం అందించిందని గుర్తుచేశారు. 2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం వాటిని మూసివేసి పేదల పొట్ట కొట్టిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్న క్యాంటీన్ల ప్రారంభంతో నిరూపితమైందన్నారు. కోటబొమ్మాళిలో ప్రతిరోజూ 400 మందికి, టెక్కలిలో 300 మందికి సరిపడేలా రూ.5కే మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. త్వరలో ఉదయం అల్పాహారం, రాత్రి భోజనాన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అన్న క్యాంటీన్లకు రూ.లక్ష ఆర్థికసాయం అందించిన కోటబొమ్మాళికి చెందిన డాక్టర్ బలగ మురళి, రూ.పది వేలు అందించిన జామి చలపతిరావును మంత్రి అభినందించారు. దాతలు అన్న క్యాంటీన్లకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి విజయ్ కుమార్, ఆర్‌టిసి టెక్కలి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, టిడిపి టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, బోయిన రమేష్, తెలుగు మహిళ మండల అధ్యక్షులు మెండ దమయంతి, నాయకులు ఎల్.ఎల్ నాయుడు, చాపర గణపతిరావు, హనుమంతు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నేటి నుంచి రెండు కొత్త ఇసుక స్టాక్ పాయింట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


ప్రజాశక్తి- శ్రీకాకుళం

గార మండలం శాలిహుండం, బూర్జ మండలం కాఖండ్యాంలో కొత్తగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శాలిహుండం స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను పొందేందుకు శాలిగుండం, కాఖండ్యాం నుంచి పొందేందుకు లంకాం మామిడివలస గ్రామ సచివాలయాల్లో బుకింగ్స్ స్లిప్స్ తీసుకోవాలని సూచించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన బుకింగ్ స్లాట్ కేటాయించనున్నట్లు తెలిపారు. బుకింగ్ పాయింట్ల వద్దకు వాహనాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. నిర్ణీత స్లాట్ సమయానికి స్టాక్ పాయింట్ వద్దకు వాహనాలను అనుమతిస్తారని తెలిపారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సిసిటివిలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక రవాణాదారులు బుకింగ్ పాయింట్ వద్ద గానీ శ్రీకాకుళం ఆర్‌టిఒ కార్యాలయంలో వారి ఆధార్, ఫోన్ నంబరు, చిరునామా నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక ఆధార్ నంబరు వినియోగదారునికి రోజుకు 20 టన్నులు మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. ఇసుకకు సంబంధించి ఏదైనా సమస్యలపై వాట్సాప్ నంబరు 9701691657, టోల్ ఫ్రీ నంబరు 1800 425 6012, ఇ-మెయిల్ dmgosklmsand-complaints@myyahoo.com సంప్రదించాలని సూచించారు.

అరసవల్లి ఇఒగా రమేష్‌బాబు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా డి.ఎల్.వి రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇఒగా పనిచేసిన ఎస్.చంద్రశేఖర్ అన్నవరం దేవస్థానానికి బదిలీ అయింది. ఈ ఏడాది రథసప్తమికి ముందు అన్నవరం ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబును గత ప్రభుత్వం అరసవల్లి ఇఒగా నియమించింది. రథసప్తమి ఉత్సవాల సమయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి పని సర్దుబాటు పేరుతో బదిలీ చేసింది. అక్కడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. .

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 31, వచ్చే నెల ఒకటో తేదీల్లో తిరుపతి వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి జట్టు ఎంపికను సోమవారం నిర్వహించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన టౌన్ హాల్ వేదికగా నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎపి తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని నేషనల్ సంస్కృత యూనివర్శిటీలోని ఇండోర్ స్టేడియంలో రెండవ అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్(ఖేలో ఇండియా)-2024 పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. తిరుపతిలోని కరకంబడి రోడ్డులో గల తైక్వాండో అకాడమీలో 40వ ఎపి స్టేట్ సీనియర్ కుర్గీ, 13వ ఎపి స్టేట్ పూమ్ సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ టీమ్‌లకు కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీ వ్యవహరించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల నిర్వహణలో నవీన్, శాప్ కోచ్ లక్ష్మణ్, జోగిపాటి వంశీ, ఎన్.శేఖర్, హరి పాల్గొన్నారు.

31 వరకు క్రీడా వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: ఈనెల 29వ తేదీన ప్రముఖ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు క్రీడా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో క్రీడాకారులు, జిల్లాలోని పలు హాస్టళ్ల విద్యార్థులతో సోమవారం ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న క్రీడా మైదానాల్లో పోటీలు, 28న పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు, 29న ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులతో ర్యాలీ, 30, 31న అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడాంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవడానికి ఫిట్‌నెస్, నా ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 30 నిమిషాలు కేటాయిస్తాను. నా కుటుంబసభ్యులు, స్నేహితులు, పొరుగు వారిని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తాను' అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి శ్రీధర్, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఇసుక.. దొరకనంటోంది



ఒడిశా నుంచి వచ్చిన ఇసుక

- పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇసుక కొరత
- ఇదే అదనుగా పెరిగిన రేట్లు
- ఆగుతున్న నిర్మాణాలు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉంది ప్రస్తుతం భవన నిర్మాణ రంగం పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన ఇసుక విధానం అమల్లోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా నామమాత్రపు ధరతో ఇసుక అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇసుక రీచ్‌లు తక్కువ కేటాయించడం, ఇతర సాంకేతిక కారణాలతో ప్రస్తుతం చాలా నియోజకవర్గాల్లో ఇసుక కొరత ఏర్పడింది.

ప్రజాశక్తి- కవిటి / పలాస

జిల్లాలో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సంబంధించి కేవలం టెక్కలిలో మాత్రమే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారు. అక్కడ నిత్యం కిలో మీటర్ల మేర ట్రాక్టర్లు బారులు తీరి ఉంటున్నాయి. దీంతో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలు ఇసుక కోసం నానా అగచాట్లు పడుతున్నారు. కనీసం ఒడిశా నుంచైనా తెప్పించుకుందాం అంటే ప్రస్తుతం ఆంధ్రా పరిస్థితి తెలుసుని ఉన్న పళంగా అక్కడ రేట్లు పెంచేశారు. ఉదాహరణకు గతంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలానికి ట్రాక్టర్ ఇసుక రూ.4 వేలు నుంచి రూ.4,200కి వచ్చేది. ప్రస్తుతం అది రూ.5 వేలకు చేరుకుంది. దీంతో చేసేది లేక అవసరమైన వాళ్లు తెప్పించుకుంటున్నారు.

ఇసుక కోసం నిరీక్షణ

పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు, ఇచ్ఛాపురం నియోజకవర్గం భాననిర్మాణాలకు రోజూ ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల నుంచి పది వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుంది. శ్రీకాకుళం, నరసన్నపేట, జలుమూరు, కాశీనగర్ (ఒడిశా), రుషుకుల్య (ఛత్రపూర్), గంజాం ప్రాంతాల నుంచి నిత్యం లారీలపై ఇసుక తెచ్చి ఈ రెండు నియోజకవర్గాల్లో అమ్మకాలు సాగుతుంటాయి. ఈ పరిస్థితిని గుర్తించిన గత ప్రభుత్వం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం కూడలి వద్ద ఇసుక అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించి అక్కడ నుంచే నేరుగా భవన నిర్మాణదారులకు వెళ్లేది. దీంతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి ఇసుక భారీగా చేరుకోవడంతో ఇసుక కష్టాలు ఉండేవికావు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకపై స్పష్టమైన వైఖరి అవలంబించడం, ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రకటించడంతో గత పదిహేను రోజులుగా ఇసుక దిగుమతి నిలిచిపోయింది. ప్రభుత్వం టెక్కలి, అంగూరు ప్రాంతాల్లో మాత్రమే ఇసుక విక్రయ కేంద్రాలు ప్రారంభించి నిత్యం వేల టన్నుల అవసరం ఉన్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలు విస్మరించడంతో ఇక్కడ భవన నిర్మాణదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జంటపట్టణాల్లో నిర్మాణరంగం ఊపందుకుంటున్న సమయంలో ఇసుక కొరత కారణంగా రూ.కోట్లు విలువైన భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రస్తుత విధానం వల్ల అదనపు ఇబ్బందులు ఏర్పడ్డాయని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే ఒకరికి ఇస్తామని చెబుతుండడంతో నిర్మాణదారుల్లో మరింతగా ఆందోళన పెరిగిపోయింది. నిత్యం వేల టన్నుల ఇసుక కావాల్సిన ప్రాంతాల్లో ర్యాంపులు నిర్వహించకుండా పొరుగు నియోజకవర్గంలో ర్యాంపు పెట్టడంతో ఎటువంటి ప్రయోజనం లేదని నిర్మాణదారులు అంటున్నారు. వాస్తవానికి టెక్కలి కంటే నరసన్నపేట వద్ద నేరుగా నదినుంచి ఇసుక తీసుకురావడమే సులభమని రవాణాదారులు చెబుతున్నారు.

మరోవైపు నిత్యం ఇసుక తీసుకురావడంలో రద్దీగా ఉండే తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని లారీ, ట్రాక్టర్స్ యాజమాన్యం అంటోంది. ఇసుక కొరత కారణంగా ఒడిశా నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నా తమకు ఎందుకూ వినియోగపడడం లేదని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలాసకు ఎటువంటి ఇసుక లభ్యత లేకపోవడంతో ప్రభుత్వం సరఫరా చేసే ఇసుకపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కోసంగిపురం వద్ద ఉన్న ర్యాంపులో నిల్వలు పెట్టుకునేందుకు వీలుగా భారీ స్థలాలు ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ ర్యాంపు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి బాహుదా, సోంపేట ప్రాంతానికి మహేంద్ర తనయా నదుల నుంచి ఇసుక కొరత తీర్చుకోవడానికి అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ ర్యాంపులు ఏర్పాటు చేస్తే తమకు మేలు జరుగుతుందని వినియోగదారులు అంటున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి- హిరమండలం

మండలంలోని కిట్టాలపాడు సమీపంలోని కూర్మ గ్రామంలో ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. అనంతరం గ్రామాభివృద్ధికి రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లోతుగడ్డ తులసీవరప్రసాద్, ఎంపిపి తూలుగు తిరుపతిరావు పాల్గొన్నారు. అలాగే జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. పురోహితులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు.


వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

బంటుపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని బంటుపల్లిలో యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సోమవారం ప్రారంభించారు. అలాగే బంటుపల్లి జంక్షన్, జాతీయ రహదారికి దగ్గర ఉన్న కృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలిచేటి సురేష్ కుమార్, పిసిని జగన్నాథం నాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, లెంక శ్యాం, పిన్నింటి భానోజీ నాయుడు, రౌతు శ్రీనివాసరావు, లెంక ప్రభ, ముల్లు కృష్ణ, దుమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఎరువుల డీలర్లపై వివక్ష తగదు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ఎరువుల డీలర్లపై ఫెర్టిలైజర్ కంపెనీలు వివక్ష చూపుతున్నాయని జిల్లా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్ల అసోషియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ సూర్య నారాయణ అధ్యక్షతన అరసవల్లిలో ఉన్న రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనంలో డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన సబ్సిడీ ఎరువుల్లో 50శాతం (ఒక్కోసారి అంతకు మించి) ప్రభుత్వ ఆధీనంలోని మార్క్‌ఫెడ్, ఆర్‌ఎస్కే, పిఎసిఎస్‌లకు పంపిణీ చేస్తున్న సమయంలో వారితో సమానంగా ప్రైవేట్ ఎరువుల డీలర్లకు ట్రాన్స్‌ఫోర్ట్ సౌకర్యంలో కంపెనీలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. ఎరువులతో పాటు లింక్ పెడుతున్న మైక్రో న్యూట్రిన్స్, నానోలిక్విడ్స్ ఇతర ఉపఉత్పత్తులు సైతం వారితో సమానంగా అమ్మాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. కేవలం ప్రైవేట్ వర్తకులకు మాత్రమే లింక్ ప్రొడక్ట్ అమ్మకాలు చేస్తే వినియోగదారులైన రైతులు డీలర్లను దోపిడీదారులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు అనుగుణంగా రాయితీ ఎరువుల్లో మార్పులు, మారుతున్న పద్ధతులపై విస్తృతమైన ప్రచారం కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదేనని పేర్కొన్నారు. బస్తాపై స్థానికంగా హమాలీ కోసం రూ.15 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తున్న నేపథ్యంలో ఎంఆర్‌పి ధరలకు విక్రయిస్తే బస్తాకు రూ.30 నుంచి 50 వరకు నష్టపోతామన్నారు. దీనిపై జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రితో పాటు ప్రభుత్వానికి తమ సమస్యలను తెలిపామన్నారు. సమావేశంలో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వైశ్యరాజు గోవిందరాజు, సభ్యులు ధోని కొండలరావు, బోయిన గోపాల కృష్ణమూర్తి, పొట్నూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

29న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

కవిటి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రైనింగ్ సెంటర్ ప్రవేశాలకు సంబంధించి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చెందిన ప్రతిభ గల యువ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు మండలంలోని రాజపురం ఎపి మోడల్ పాఠశాల వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ జాయింట్ సెక్రటరీ బల్లెడ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే బాలబాలికల వయసు 14 నుంచి 16 ఏళ్లు, ఎత్తు 170 సెం. అంతకంటే ఎక్కువ ఎత్తు కలిగి ఉండాలని అన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులకు సెప్టెంబరు 1న విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో తుది ఎంపికలు ఉంటాయని చెప్పారు. అక్కడ ఎంపికైన వారికి వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణతో పాటు వసతి, రోజువారి పౌష్టికాహారం, ప్రత్యేక స్పోర్ట్స్ కిట్, రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 8498841717 నంబరుకు సంప్రదించాలని కోరారు.

సహారా చెల్లింపులకు బాధ్యత తీసుకోవాలి

పొందూరు: రెండు రాష్ట్రాల్లో సహారా ఇండియాలో ఇన్వెస్ట్ చేసిన ఖాతాదారుల డిపాజిట్ల మొత్తాలను చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని సహారా ఏజంట్ల సంఘం ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు మార్యా సుజాత డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జెవిఆర్ కళ్యాణ మండపంలో సోమవారం ఉత్తరాంధ్ర సహారా ఇండియా ఏజెంట్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 12 ఏళ్లుగా కాలపరిమితి పూర్తయిన డిపాజిట్లకు చెల్లింపులు జరగకపోవడంతో ఏజంట్లపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. ఖాతాదారుల ఒత్తిడి కారణంగా అమాయకులైన ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనికారణంగా వారి కుటుంబాలు రోడ్డును పడుతున్నాయన్నారు. సంఘం నాయకులు సత్యన్నారాయణ, సత్తిరాజు, అన్నాజీ, సహారా ఏజంట్లు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు

వజ్రపుకొత్తూరు: వాహనదారుల భద్రతే ధ్యేయంగా చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ బి.దుర్గారావు తెలిపారు. వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్ నుంచి నువ్వులరేవు వరకు వెళ్లే ఆర్అండ్‌బి రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పెద్ద పెద్ద చెట్ల కొమ్మను సోమవారం తొలగించామని అన్నారు. రహదారులకు ఇరువైపుల చెట్లు, పొదలు మూసుకొని రావడంతో రహదారి సగమే కనిపిస్తుందని అన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించని పరిస్థిత వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయం ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లిగా పొదలు తొలగించే కార్యక్రమం చేపట్టినా అధికారులకు అభినందనలు తెలిపారు. దువ్వాడ వంశీకృష చౌదరి పాల్గొన్నారు.


కొమ్మలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పలాస : శివాజీ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు కృష్ణ, రాధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు ఈ వేడుకల్లో సందడి చేశారు. నగరంలోని కృష్ణాపార్క్ వద్ద కృష్ణుని విగ్రహానికి యాదవ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో యాదవ సంఘాల ప్రతినిధులు కిల్లాన శ్రీనివాస్, గడ్డిబోయిన కృష్ణ యాదవ్, కళా వెంకటరావు యాదవ్, కలగ కేశవ యాదవ్, మట్టా రమణ యాదవ్, బోయిన హేమసుందర్, పాలిన గోపి, యుగంధర్ పాల్గొన్నారు.

రవీంద్ర భారతి పాఠశాలలో...

చినమండలి వీధి రవీంద్రభారతి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ప్రిన్సిపాల్ ఘోరా చంద్ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు గోపికలుగా, శ్రీకృష్ణునిగా, సత్యబామగా వేసిన వేషధారణలు, ఉట్టికొట్టే సన్నివేశాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. డివి.రమేష్, డీన్.వి.నాగరాజు పాల్గొన్నారు.

హయాతీనగరంలో

నగరంలోని హయాతినగరంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు తోనంగి వెంకన్న యాదవ్, డివిజన్ పెద్దలు ఐ.వర్మ, అప్పలరాజు, చిన్న, ఐ.జగదీష్, రమేష్, తాతారావు, దుక్కరాజు, సూరిబాబు, ఆటో రమేష్ పాల్గొన్నారు.

జాయ్ కిడ్స్ స్కూల్‌లో

శ్రీకృష్ణాష్టమి వేడుకలను జాయ్ కిడ్స్ స్కూల్‌లో కరస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన బాలకృష్ణుడు, గోపికలు, రాధ, రుక్మిణి, సత్యభామ, యశోద వంటి వేషధారణలు అలరించాయి. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రంలో...

నగరంలోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజక్టు పరిధిలో గల గూనపాలెం సెక్టార్‌లో మావుడూరి వారి వీధి అంగన్వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళ్యాణి, కార్యకర్తలు జ్యోతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో త్రైతసిద్ధాంతం, ప్రభోదసేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు కృష్ణాష్టమి వేడుకలు జరుపనున్నారు. మొదటిరోజు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కృష్ణపరమాత్మ ప్రతిమలను పొందూరు పట్టణంలో ఊరేగించారు. ప్రబోదసేవాసమి సభ్యులు సత్యనారాయణ, అనిల్, చిన్నమ్మడు, కృష్ణ పాల్గొన్నారు.



పలాస : కాశీబుగ్గ రథయాత్ర మైదానంలో నియోజకవర్గం యాదవ సంఘం ఆధ్వర్యాన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జానపద, సంప్రదాయ నృత్య పదర్శనలు, గిరిజన ధింసా నృత్యం, సంగెడిరాళ్ల పోటీ, ఉట్టికొట్టడం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజి, విజయలక్ష్మి దంపతులు, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు. అలాగే రేగులపాడుకు చెందిన తప్పెడగుళ్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బొడ్డపాడు కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, జాలారీ నృత్యాలు, పలాసకు చెందిన మహిళా బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంగెడిరాళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గౌతు శివాజీ దంపతులను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, వెంకన్న చౌదరికు ఘనంగా సన్మానించారు. అనంతరం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, దాసరి తాతారావు, కిక్కర ఢిల్లీరావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, కొండే నర్సింహులు, నర్సింహులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని ఒనవిష్ణుపురంలో పాలిన ప్రసాద్ ఆధ్వర్యాన కృష్ణామి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే కోలాటం నిర్వహించారు.


శ్రీకాకుళం అర్బన్ : రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు


ఇచ్ఛాపురం : ఉట్టి కొడుతున్న చిన్నారులు

కవిటి: కృష్ణాష్టమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల, కవిటి కొత్తూరు ఆర్ష విజ్ఞాన భారతిలో వేడుకలు అంబరాన్నంటాయి. పాఠశాలలో చిన్నారులతో శ్రీకృష్ణుడు, గోపికల వేషం ధరింపజేసి ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు.

మందస : మందస బజారు వీధిలో కృష్ణాష్టమి వేడుకలు ధర్మాదాయ దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వాసుదేవరావు ఆధ్వర్యాన నిర్వహించారు. అర్చకులు నిర్మలా పాణిగ్రాహి, ఎం.శంకరరావు, సుభాషిణి పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణభారతి విద్యా సంస్థలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు వేషధారణ, ఉట్టి కొట్టడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవకు చిరునామా మదర్ థెరిసా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎందరో అనాథలు, అభాగ్యులకు అమ్మగా సేవలందించి నోబెల్ శాంతి బహుమతి, భారతరత్న వంటి కీర్తి పతాకాలను అందుకున్న మదర్ థెరిసా చిరస్మరణీయురాలని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం ఆమె 114వ జయంతి మహాత్మా జ్యోతిరావు పూలే పార్క్, గాంధీ మందిరంలో నిర్వహించారు. ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, విష్ణుమూర్తి, శాస్త్రి, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పూలే పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు బాడాన దేవభూషణరావు, అమీరుల్లా బేగ్, గడ్డిబోయిన కృష్ణారావు, గుత్తి చిన్నారావు, పిఎస్‌ఆర్ నాయుడు, కాళ్ల వెంకటరావు, వై. శ్రీనివాస్, ఎల్.నాగరాజు, పసగాడ సూర్యనారాయణ, జి.కన్నబాబు, రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బిసిరింగి సింహాచలం అధ్యక్షతన భారతరత్న, నోబుల్ శాంతి పురస్కార గ్రహీత మదర్ థెరిసా 114వ జయంతిని సోమవారం నిర్వహించారు. పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యాన మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సారవకోట ఎంఇఒ మడ్డు వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే మహాత్మా జ్యోతి భాయ్ పులే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గణపతి శ్రీరాములు మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సొండిపూడి హెచ్ఎం బి.అనిల్‌కుమార్, పాస్టర్ ఎన్.ఫిలిప్, సదా బెహరా, బి.మీనాకుమారి, బి.పి.ప్రసాద్ పాల్గొన్నారు.

పలాస : మదర్ థెరిసా జీవితం ఆదర్శప్రాయమని మదర్ థెరిసా పాఠశాల చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని అన్నారు. స్థానిక మదర్ థెరీసా పాఠశాలలో సోమవారం మదర్ థెరీసా జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేశారు .కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖ, స్రవంతి, బేబీ, జీవరత్నం, యశోద, కల్పన, సావిత్రి పాల్గొన్నారు.


పాతపట్నం : మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం ఉంగటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఆలయ ఇఒ డి.ఎల్.వి. రమేష్ బాబు శేషవస్త్రాన్ని కప్పి మెమోంటోను అందజేశారు.

శివాజీని కలిసిన సిఐ

ప్రజాశక్తి- పలాస

పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శివాజీకు కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ పలాస ప్రాంతానికి ప్రత్యేకత ఉందని, ప్రాంతాన్ని ప్రశాంతంగా ఉండేలా చూడాలని కోరారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు.

లయన్స్ క్లబ్ హర్షవల్లి సేవలు స్ఫూర్తిదాయకం


ప్రమాణ స్వీకారం చేస్తున్న జగన్నాథం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పర్యావరణ పరిరక్షణకు, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పిఎంజెఎఫ్ గవర్నర్ ఎన్.వి.బి.ఎస్ఎస్.ప్రసాద్ ప్రశంసించారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ క్లబ్ నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. క్లబ్ వ్యవస్థాపకులు హారికా ప్రసాద్, జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నర్ సుబ్బరాజు, సూర్యప్రకాష్, రంగనాథ్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, వాన కృష్ణచంద్, సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా వావిలపల్లి జగన్నాథం నాయుడు, సెక్రటరీగా పిఎన్ మణిశర్మ, ట్రెజరర్ లక్ష్మీకాంత్, జాయింట్ ట్రెజరర్ ఎస్.లక్ష్మీపతి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, పి.మధుబాబు, క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్‌గా ఎ.వెంకునాయుడు, క్లబ్ మార్కెట్ అండ్ కామన్ చైర్‌పర్సన్ కె. పార్వతీశ్వరరావు, క్లబ్ ఎల్‌సిఐఎఫ్ కో- ఆర్డినేటర్ సిహెచ్ శిరీష, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ సుమన్‌లు నియమితులయ్యారు.


రాజశేఖర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

రాజశేఖర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో మృతి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. మండలంలోని వంజంగి గ్రామానికి చేరుకున్న ఆయన రాజశేఖర్ తల్లిదండ్రులు, తాత, కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వ సహాయం, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజశేఖర్ కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి కృషి చేస్తానన్నారు. అలాగే మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల్లో పలు కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో వంజంగి మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీ పతిరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస, పొందూరు : ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీ బాధిత కుటుంబాలను మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. సోమవారం నియోజకవర్గంలోని ఆముదాలవలస మండలం వంజంగికి చెందిన పైడి రాజశేఖర్, పొందూరుకు చెందిన హంస ప్రశాంత్‌లు మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఫార్మా కంపెనీలో పని చేస్తున్న సిబ్బంది వారి జీవితాలను పణంగా పెట్టేలా కంపెనీ యాజమాన్యాలు ప్రవర్తిస్తున్నా యన్నారు. కంపెనీ నిర్వహణ విషయంలో భద్రతాపరమైన చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పరిశ్రమలను గుర్తించి వాటిలో భద్రతా లోపాలను గుర్తించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి సంఘటన జరిగిన తీరుపై ఆరా తీసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను పరామర్శించి పార్టీ పరంగా ఆర్థికసాయం ప్రకటించారన్నారు. ఇటువంటి సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటువంటి మానవీయ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు పార్టీలకు అతీతంగా ఆయా కుటుంబాలకు ప్రతిఒక్కరు వెన్నుదన్నుగా నిలవాలని తమ్మినేని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, కోట గోవిందరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని

ప్రసాద్ కుటుంబానికి అండగా వైసిపి

ఎచ్చెర్ల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో హత్య రాజకీయాలకు తెర లేపిందని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి హత్య రాజకీయాలు ప్రజలు హర్షించరని, అధికారం శాశ్వతం కాదని మాజీ డిప్యూటీ సిఎం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం పరీధుపేటలో దాడిలో మరణించిన వైసిపి కార్యకర్త కూన ప్రసాద్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తో కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎచ్చెర్ల మాజీ జెడ్‌పిటిసి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షులు ముద్దాడ శంకరరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి బెండు రామారావు, నాయకులు మురళీధర్ బాబా, బొడ్డేపల్లి సుధాకర్, కొత్తకోట సూర్యారావు, సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు లోకనాథం మాస్టారు


లోకనాథం, ఇందిర

ప్రజాశక్తి- సోంపేట

ఉపాధ్యాయుడుగా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది అందరికీ ఆదర్శనీయులుగా మన్ననలు పొందారు మండలంలోని బట్టిగళ్లూరు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న మర్రి లోకనాథం మాస్టారు. మండలంలోని మండలం మామిడిపల్లికి చెందిన మర్రి నర్సింహులు, సావిత్రమ్మలకు లోకనాథం 1962, ఆగస్టు 5న జన్మించారు. ఇతనికి ఒక తమ్ముడు మర్రి గోవిందరావు, ఇద్దరు చెల్లెళ్ల లోలాక్షి, ఈశ్వరిలు ఉన్నారు.

విద్యాభ్యాసం

మండలంలోని మామిడిపల్లిలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదివారు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు బారువ జిల్లా పరిషత్ పాఠశాలలోను, ఇంటర్ మీడియట్ చదువును సోంపేట (1978-80) ప్రభుత్వ కళాశాలలో పూర్తిచేశారు. విశాఖపట్నంలో డిగ్రీ పూర్తి చేసి బరంపురం యూనివర్సిటీలో బిఇడి చదివారు.

ఉద్యోగం

1989 డిఎస్‌సిలో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. కవిటి మండలం ఆర్.బెలగాం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. తరువాత ఎర్రముక్కాం, మామిడిపల్లి, మామిడిపల్లి కాలనీ, ఎకువూరు గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్‌జిటి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పనిచేస్తున్నారు. ప్రస్తుతం బట్టిగళ్లూరు ఎంపిపి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

యుటిఎఫ్ సభ్యులుగా...

లోకనాథం మాస్టారు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి యుటిఎఫ్‌లో సభ్యులుగా ఉన్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సమయంలో అటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేశారు. మామిడిపల్లి పాఠశాల కాంప్లెక్స్ కార్యదర్శిగా 30 ఏళ్ల పాటు పనిచేశారు.

సామాజిక సేవ

మామిడిపల్లికి చెందిన కామ్రేడ్ పాతిని కృష్ణమూర్తి మాస్టారిని ఆదర్శంగా తీసుకున్నారు. అభ్యుదయ, వామపక్ష భావాలు అధికంగా ఉన్న మామిడిపల్లిలో జన్మించడం వల్లనే సామాజిక సేవా కార్యక్రమాలకు ఎక్కువగా ఆకర్షితుల య్యారు. గ్రామంలో భగత్‌సింగ్ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేశారు.

కుటుంబం నేపథ్యం

లోకనాథంకు ఆయన భార్య మర్రి ఇందిర. ఈమెది కవిటి మండలంలోని ముత్యాలపేట. కామ్రేడ్ కృష్ణమూర్తి మాస్టారు బంధువైన ఇందిరను లోకనాథం మాస్టారు ఇచ్చి వివాహం చేశారు. ఆమె కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి మణీంద్రవర్మ, ప్రవీణ్‌వర్మ ఉన్నారు. మణీంద్రవర్మ విప్రోలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ప్రవీణ్‌వర్మ బిటెక్ పూర్తి చేశారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి


మమిత సర్బంగ్

జి.సిగడాం: మండలం జి.సిగడాం, నిద్దాం గ్రామాల మధ్య రైలు ట్రాక్‌పై మహిళ మృత దేహం పడి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం సోనాపూర్ జిల్లాకు చెందిన మహిళ మమిత సర్బంగ్ (21) రైలు నుంచి కాలు జారి పడి ఉండవచ్చునని తెలిపారు. ఆమె వద్ద బ్యాగ్‌లో ఆధార్ కార్డు ఉందని, ఆదివారం రాత్రి లేదా సోమవారం వేకువజామున ఒడిశా నుంచి వస్తున్న రైలు నుంచి జారిపడి ప్రమాదం జరిగి ఉంటుందని శ్రీకాకుళం రైల్వే ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పట్టని పరిస్థితిలో ఉందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యంతో ఇద్దరు అరెస్టు


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాతపట్నం : ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్రమంగా ఒడిశా మద్యం తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. తన సిబ్బందితో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా సారవకోట, మెళియాపుట్టి మండలాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పట్టుపడ్డారని అన్నారు. వారి వద్ద నుంచి బైక్, రూ.2,130 విలువైన 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిత్యం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. అక్రమంగా గంజాయి, మద్యం, నిషేధిత ఖైనీ, గుట్కాలు విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సోంపేట ఇఒగా శాంతకుమారి


శాంతకుమారి

సోంపేట సోంపేట మేజర్ పంచాయతీ ఇఒగా శాంతకుమారి సోమవారం నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలోని డిఆర్‌సిలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న ఈమెకు ఉద్యోగోన్నతి లభించింది. రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

టెక్కలి పంచాయతీ ఇఒగా జగన్నాథం

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ ఇఒగా కె.వి.వి.జగన్నాథం నియమితులయ్యారు. ఈయన నరసన్నపేట మండలం మబగాం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. గ్రేడ్ వన్ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది ఇఒగా నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలను స్వీకరించారు.


అవార్డు స్వీకరిస్తున్న భుజంగరావు

భుజంగరావుకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో యువసాహితి సంస్థ ఆధ్వర్యంలో 2024 పల్లా జాతీయ కవితా పురస్కారం ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. శ్రీకాకుళానికి చెందిన కవి కంచరాన భుజంగరావు రచించిన కవితా సంపుటి 'నీటిగింజల పంట'కు ఈ అవార్డు ప్రధానం చేశారు. కవి భుజంగరావును శాలువా, సైటేషన్, జ్ఞాపిక, నగదు బహుమతితో ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతపురానికి చెందిన ప్రముఖ కవి ఉమ్మడిశెట్టి అవార్డు వ్యవస్థాపకులు డా. రాధేయ 'నీటిగింజల పంట' కావ్యాన్ని సభికులకు పరిచయం చేశారు. కేంద్రసాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, ప్రముఖ నాటకకర్త, నటుడు ఎసి దస్తగిరి, ప్రముఖ అనువాదకులు డా. కొమ్మిశెట్టి మోహన్, అవధాని డా. నరాల రామారెడ్డి, సిఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సి.వి.రాజగోపాల రెడ్డి, తొగట వీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు రఘురామయ్య, యువసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. పల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తా

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వివిధ పనుల కోసం తన దగ్గరకు వచ్చిన ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ గ్రామాల్లో సమస్యలు విడతల వారీగా పరిష్కరిస్తానని అన్నారు. ఇక నుంచి నేను ఉదయం పూట కార్యకర్తలు, ప్రజలు సమస్యలు వినతలు తీసుకుంటానని, రెండో పూట గ్రామాల్లో పర్యటించి గ్రామ పరిస్థితులను తెలుసుకొని పరిష్కరిస్తానని అన్నారు. అంతకుముందు కార్యాలయంలోని ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : పశువులకు టీకాలు వేస్తున్న అప్పలసూరి

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిపేట, ఊడికలపాడు, కిష్టుపురం, బలరాంపురం, కస్తూరిపాడు, జర్జంగి తదితర గ్రామాల్లో 787 పశువులకు సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని స్థానిక పశు వైద్యాధికారి లఖినేని కిరణ్ కుమార్ తెలిపారు. ఈ నివారణ టీకాలు స్థానిక పశుసంవర్ధక సంచాలకులు ఎం.లోకనాథం ఆధ్వర్యాన వేశామన్నారు. నాలుగు మాసాల దూడల వయసు నుంచి అన్ని వయసులు గల పశువులకు వేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రజ్ఞచైతన్య, పశు వైద్య సిబ్బంది వెంకటరమణ, చిరంజీవి, బాలమ్మ, భాస్కరరావు, ధర్మారావు, బాబూరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని తోటాడ పంచాయతీలో 180 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని పశువైద్యాధికారి అప్పలసూరి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్లన్నగుల సునీత రామరాజు, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటరమణ, తిరుపతిరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



చెత్తను కాల్చుతున్న యువకులు

కంచిలి : స్థానిక బిసి కాలనీలో కొద్దిరోజులుగా పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక యువకులు సోమవారం చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీకి చెందిన పూనా రవికుమార్, గుడియా మిట్టు, తెంబూరు చిన్న తదితరులు కాలనీ సమీపంలో వేసిన చెత్తను పోగుచేసి కాల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అధికారులకు చెప్పిన ఫలితం లేకపోవడంతో తామే చెత్తను తొలగించేందుకు పూనుకున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు స్పందించి పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీరు పారేదెలా...!

ప్రజాశక్తి- పొందూరు



పేరుకుపోయిన గుర్రపు డెక్క

గుర్రపు డెక్క నిండుగా పేరుకుపోయి సాగునీటికి అడ్డంకిగా మారిన ఈ దృశ్యం మండలం గోకర్ణపల్లి గ్రామ సమీపంలోని నారా యణపురం కుడికాలువ లోనిది. ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లాది ఖర్చు చేసి కాలువలను శుభ్రం చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా ఆ పరిస్థితి కానరావడం లేదు. ఈ విధంగా గుర్రపు డెక్క పేరుకుపోవడంతో తుమ్మలు, మద్దుముల ద్వారా పొలాలకు సాగునీరు సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మాజీ ఎంపిటిసి, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు మాట్లాడుతూ కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి సకాలంలో రైతులకు సాగునీరు అందేలా తక్షణం అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

200 రోజుల 'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ఉపాధి పనులు 200 రోజులు కల్పించి... రోజుకు రూ.500 చెల్లించాలని మండలంలోని ఉప్పలం పంచాయతీ పరిధిలోనిమహిళా సమైక్య సభ్యులు డిమాండ్ చేశారు. ఎపి మహిళా సమాఖ్య సభ్యులు ఆధ్వర్యాన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ అధ్యక్షతన సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పలాం పంచాయితీలో సుమారుగా 600 మంది పైగా కూలీలు ఉన్నారని అన్నారు. రెండేళ్లుగా ఉపాధి పనులు కల్పించడం లేదని అన్నారు. ఏడాదికి ఒక వ్యక్తికి 12 రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని అన్నారు. ఈ పంచాయతీ ప్రజలు సముద్రం వేటపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. సముద్రమంతా కలుషితమై చేపలు సక్రమంగా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పిల్లలను చదివించుకోలేక, పెరుగుతున్న నిత్యావసర ధరలు ఆకాశాన్నంతుతుంటే కొనుక్కొని తినడానికి స్తోమత లేక అర్ధాకలితో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఏడాదికి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, రోజుకు రూ.500 వచ్చేలా కృషి చేయాలని కోరారు. అలాగే పంచాయతీలోని అందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరారు. బి.మాడికమ్మ, పి.లక్ష్మీకాంతం, వి.నీలవేణి, ఎం.హేమవతి, బి.రాజులమ్మ, బి.భూలక్ష్మి, యాదవతి, ఎస్.బాలనాగమ్మ పాల్గొన్నారు.

కర్రసాముకు పూర్వ వైభవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న శివప్రసాద్ దేవ్

సిలంబం (కర్రసాము) క్రీడ పురాతన క్రీడని, ఆదరణ లేకపోవడంతో అది మరుగున పడుతుందని దానిని పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కృషి చేస్తామని ఎపి సిలంబం టెక్నికల్ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎపి స్టేట్ సిలంబం అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని ఆదివారం పేట ప్రఫ్రద కల్యాణ మండపంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. మానవ జీవన గమనంలో కర్రసాముకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ క్రీడ ఆరోగ్య, ఆత్మరక్షణ కూడా ఉపయోగ పడుతుందన్నారు. కర్రసామును క్రీడాకారులు ఆదరించక పోవడంతో అది కనుమరుగయ్యే ప్రమాదంలో పడిందన్నారు. కర్రసాము ఏ వయసులో వారైనా నేర్చుకునేందుకు సులువుగా ఉంటుందని చెప్పారు. చిన్నతనంలోనే కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఈ క్రీడను అభివృద్ధి చేస్తున్న హర్షవర్ధన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ వి.శ్యామసుందరరావు, స్టేట్ సెక్రటరీ సత్య శ్రీకాంత్, బిసిటర్ చంద్రమౌళి, ఎల్.నాగేశ్వరరావు, జోగినాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండాశి

అభివృద్ధే లక్ష్యం

పోలాకి : అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన మండల అధ్యక్షుడు ఎన్.దండాశి అన్నారు. పోలాకిలో కార్యకర్తలతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పాలనలో ప్రజలు అభిప్రాయాలను తెలుసుకోవడం, వారిని అభివృద్ధిలో భాగస్వామి చేసి పరిపాలన అందించడం అనేది ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు విజయవంతమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెట్ట వైకుంఠరావు, యాబాజి చంద్రశేఖర్, పొట్నూరు వరప్రసాద్, కశింకోట వెంకట్, సురవరపు సంతోష్, పి.రెడ్డి, పోలీసు, సిహెచ్.రమణ, ఎల్లారావు, హరి, బాల, నరసింహమూర్తి, రాజు పాల్గొన్నారు.



ఎన్నికైన సంఘం సభ్యులు

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం ఎన్నిక

సోంపేట : ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం మండల శాఖ అధ్యక్షునిగా గొలియా ప్రకాశరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ, సోంపేట మండల సభ్యులు జైభీమ్ సేన కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లికి చెందిన ఇప్పిలి చిరంజీవి, గౌరవ సలహాదారులుగా దిష్ట గోవిందరావు, డాక్టర్ నగిరి మోహనరావులను, సోంపేట టౌన్ ఇన్‌ఛార్జిగా బసవల శ్రీనివాసరావును, సభ్యులుగా కె.రాజు, బుస్స ఈశ్వరరావు, దిష్ట రవి, తెంబూరు కాళిదాసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు చల్ల దేవరాజు, నూతలపాటి బాబూరావు, దుండగి వాసు, గూండ్ర జగ్గారావులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం: పేదలకు జెసిఐ అండగా ఉంటుందని జాతీయ ఉపాధ్యక్షులు గురుదిత్ సింగ్ అన్నారు. మండల అధ్యక్షులు షణ్ముఖరావు అధ్యక్షతన స్థానిక విజె గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో పేదలకు రూ.ఏడు వేలు విలువైన నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూరంగ్ రాజా క్రీడా మైదానంలో మొక్కలను నాటారు. స్థానిక చిదంబరేశ్వరపేట, రత్తకన్న వెళ్లే మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్ ప్రెసిడెంట్ సురేష్, వైస్ ప్రెసిడెంట్ సాయిసుధర, టూర్ కో-ఆర్డినేటర్ ఈశ్వరరావు, స్వరూప్‌కుమార్ పాల్గొన్నారు.



సరుకులను పంపిణీ చేస్తున్న గురుదిత్ సింగ్

రేపు విజయవాడలో భూ బాధితుల సదస్సు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన భూములను నిజమైన యజమానులకు అప్పగించాలని, 22ఎ అడ్డుపెట్టుకొని ఆక్రమణకు గురైన భూములను క్రమబద్ధీకరించాలని, భూ కుంభకోణాలపై వేసిన సిట్ కేసులను వేగంగా పరిష్కరించి రైతులకు అప్పగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ నెల 28న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో బాధిత రైతులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను నగరంలోని క్రాంతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని, రెవెన్యూ ఉద్యోగుల చేతివాటం కారణంగా అనేక మంది రైతులు తమ తాతల నాటి భూములను సైతం కోల్పోయి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల భూదాహం వలన రైతులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని ఆరోపించారు. వాటిని అండగా నిలిచేందుకు సిపిఐ ఆధ్వర్యాన ఉద్యమిస్తున్నామన్నారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న రైతు సదస్సుకు బాధిత రైతులు కదలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, సిపిఐ నాయకులు నజీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర ఎరువులతో అవస్థలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌కు మొదటి ఎరువుకి ఉపయోగించే యూరియా సరఫరా అరకొరగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వ్యవసాయానికి నీటి కొరత లేదని ఆనందంతో త్వరగా ఎదలు, ఉబాలు చేపట్టారు. కానీ, ఎరువుల సరఫరాలో కొరత ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని సుసరాం, గుప్పిడిపేట గ్రామాల్లోని రైతులకు ఎరువుల సరఫరాలో అవకతవకలు జరిగాయని ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, సుసరాం సర్పంచ్ దుంపల భాస్కరరావు బాహటంగా వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుసరాం రెవెన్యూలో 1900 ఎకరాలు విస్తీర్ణం వారి సాగు అవుతుంది. అయితే అవసరం లేని డిఎపి 200 బస్తాలు వరకు లోడు వచ్చింది. అధికారులు స్పందించి యూరియా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల ఎఒ చిరంజీవి వద్ద ప్రస్తావించగా... సుసరాం, ఉరజాం రెండు గ్రామాలకు కలిసి ఒకే రైతు సేవా కేంద్రం అవ్వడంతో ఈ సమస్య వచ్చిందన్నారు. ఇలాంటి సమస్య భవిష్యత్ లో రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

పలాస: రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడుతుందని జెడి కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక జెడి కార్మిక సంఘం కార్యాలయంలో ఆ నలుగురు ట్రస్టు, కామ్రేడ్ లేబర్, రైస్ మిల్లర్స్ యూనియన్ ఆధ్వర్యాన టెక్కలి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో సోమవారం మెగా రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతి ఆరు నెలలకు రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆ నలుగురు సంస్థ నుంచి మహిళలు రక్తదానం చేయడం మరింత మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మరెన్నో ఇలాంటి కార్యక్రమాలు ఆ నలుగురు ట్రస్టుతో కలిసి చేస్తామని తెలిపారు. అనంతరం 31 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చింతాడ సుధీర్ కుమార్, డాక్టర్ చిన్నంనాయుడు ఆ నలుగురు ట్రస్టు సభ్యులు సూరి ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, మన్మథరాజు, శివారెడ్డి, దీనబంధు, సభ్యులు రాము, భీమారావు, సింహచలం, పాపారావు, గణపతి, కూర్మారావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళాలు



విరాళం అందజేస్తున్న డాక్టర్ మురళి

కోటబొమ్మాళి: స్థానిక కార్యాలయంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న అన్న క్యాంటీను మండలంలోని బిద్దంగికి చెందిన డాక్టర్ బలగ మురళి రూ.లక్ష విరాళం ఇచ్చారు. దీనిని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు టిడిపి కార్యాలయంలో సోమవారం కలిసి అందజేశారు. అలాగే కొత్తపేటకు చెందిన జామి చలపతిరావు రూ.10 వేలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని తెంబూరులో ఉన్న ప్రభుత్వ హోమియో వైద్యశాలలో యోగ శిక్షకులుగా పనిచేసేందుకు మహిళలకు, పురుషుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎస్.ఉమాగౌరి ఒక ప్రకటనలో తెలిపారు. యోగా శిక్షకులుగా పనిచేసేవారు పిజి, డిగ్రీ, డిప్లమా యోగాలో అనుభవం ఉన్నవారికి శిక్షకులుగా మొదటి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. శిక్షకులుగా పనిచేసేవారు ఆగస్టు 30వ తేదీ 11 గంటల్లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. శిక్షకులకు గంటకు రూ.250 ఇస్తామని అన్నారు. పురుష శిక్షకులకు రూ.32 గంటలు, మహిళా శిక్షకులకు రూ.20 గంటలు ప్రతినెలా గౌరవ వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9441589618 సెల్ నంబరును సంప్రదించాలని తెలిపారు.

పి.ఎల్ పురంలో గ్రామసభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురంలో సోమవారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను ఆడిట్ నిర్వహించారు. గ్రామసభలో లోపాలను వెల్లడించారు. గ్రామ సచివాలయం 16 కాలమ్స్‌తో నిర్మించవలసి ఉండగా, 12 కాలమ్స్‌తోనే నిర్మించినట్లు గుర్తించారు. రూ.2 లక్షలకు పైగా పెద్ద చెరువు పనులు పేరుతో వేరే చెరువులో పనిచేయడాన్ని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ఉదయ్‌కుమార్, ఎపిఒ టి.రవి, ఎస్‌ఆర్‌పి రామారావు, డిఆర్‌పి రాజు, టిఎ కృష్ణారావు, ఎఫ్ఎ జానకిరావు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షునిగా సుదర్శనరావు

ప్రజాశక్తి- పాతపట్నం



సుదర్శనరావు

పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షునిగా సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, కొడిరామ్మూర్తి అవార్డు గ్రహీత కోడి సుదర్శనరావు ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి కబడ్డీ సెక్రెటరీ శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యాన సోమవారం పాలకొండలో జిల్లాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్ల కొండబాబు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ వెన్నపు చంద్రశేఖర్ సమక్షంలో సుదర్శనరావును నియమించారు. సుదర్శనరావు స్థానిక నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. ఈయన నియామకంపై పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

రాజారావుకు 'కలాం' పురస్కారం

ప్రజాశక్తి- పొందూరు

మండలానికి చెందిన జిల్లా శ్రీశ్రీ వేదిక ప్రధాన కార్యదర్శి, ప్రముఖ రచయిత వావిలపల్లి రాజారావు మాస్టారుకు సోమవారం విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో అబ్దుల్ కలాం పురస్కారాన్ని ప్రధానం చేశారు. డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ (యు.ఎస్.ఎ, ఇండియా), చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా రాజారావుకు అందజేసింది. గత రెండు దశాబ్దాలుగా సాహితీ రంగానికి విశిష్ట సేవలందించినందుకు గాను చేయూత అధ్యక్షులు డాక్టర్ చిన్నారావు, ఎ.పి.మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి, సినీ డైరెక్టర్ జయకుమార్, ఎ.పి.మానవహక్కుల కౌన్సిలింగ్ చైర్‌పర్సన్ శుభాకర్య, విశాఖ స్వర్ణ హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎ.సుదర్శనరావు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజారావును ఘనంగా సన్మానించారు.